www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 22 జూన్ 2025
5
వైఎస్ఆర్



రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రతి శనివారం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పి ఇ.జి.అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్‌లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా, ఓవర్ స్పీడ్ ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆగని విలీనం సెగ

- సిద్ధారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన
- పది రోజులుగా పాఠశాలకు విద్యార్థులను పంపని తల్లిదండ్రులు



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - చాపాడు

పాఠశాలలను తెరచి పది రోజులు పూర్తి అవుతున్నా విలీనం సెగ తగ్గలేదు. మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లె గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5వ తరగతుల విద్యార్థులను 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మోర్రాయపల్లి మోడల్ పాఠశాలలో విలీనం చేశారు. 12వ తేదీన పాఠశాల ప్రారంభించినప్పటి నుండి విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలలకు పంపడం లేదు. ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు పలుధపాలు పాఠశాలకు వచ్చి విద్యార్థులను పంపాలని అడిగినప్పటికీ వారు ససేమిరా అంటున్నారు. శనివారం పాఠశాలను తెరిచేందుకు వచ్చిన ప్రధానోపాధ్యాయులు శ్రీదేవిని విద్యార్థులు తల్లిదండ్రులు అడ్డుకున్నారు. పాఠశాలను తెరవకుండా నిరసన తెలియజేశారు. మా ప్రమేయం లేకుండా పాఠశాలను మూసే ప్రయత్నం చేస్తున్నారని 10 రోజులుగా పాఠశాలకు విద్యార్థులను పంపనప్పటికీ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదన్నారు. పేద దళితులమైన మా విద్యార్థుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తమ పిల్లలను చదువుకు దూరం చేసే కుట్ర జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా గ్రామంలో పాఠశాల కొనసాగించకపోతే మండల, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. గ్రామంలో పాఠశాలను కొనసాగిస్తే తప్ప ఇతర పాఠశాలకు తమ పిల్లలను పంపమని ఖరాకండిగా చెప్పారు. గ్రామం నుండి విద్యార్థులను పంపాలంటే ప్రధాన రహదారి వెంబడి విష పురుగులు, బస్సులు, ఇతర వాహనాలతో ఇబ్బందిగా ఉంటుందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. సమస్యను దృష్టిలో పెట్టుకుని అధికారులు పాఠశాల మార్పును ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు



ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన కడపలోని ఎసిఎ స్టేడియంలో ఉదయం 7.30 గంటలకు అండర్-14, అండర్-16 బాలుర జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆసక్తిగల క్రికెట్ క్రీడాకారులు హాజరు కావాలని కోరారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఎవరికి కావాల్సిన క్రికెట్ కిట్, వైట్ డ్రెస్, షూ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా తమతో పాటు ఆధార్ కార్డు కాపీ, జన్మదిన ధ్రువీకరణ పత్రం(ఫారం 5) ఒరిజినల్‌తో పాటు, ఒక సెట్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2011 సంవత్సరం సెప్టెంబర్ నెల 1వ తేదీ తరువాత గానీ, 2013 ఆగస్టు నెల 31వ తేదీ ముందు గానీ జన్మించి ఉండాలని తెలిపారు. అండర్-16 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2009 సంవత్సరం సెప్టెంబర్ నెల 1వ తేదీ తరువాత గాని, 2011 సంవత్సరం ఆగస్టు నెల 31వ తేదీ ముందు గానీ జన్మించి ఉండాలని తెలిపారు.

నేటి నుంచి మల్టీ డే క్రికెట్ టోర్నీ ప్రారంభం : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎసిఎ సహకారంతో ఈనెల 22వ తేదీ నుండి కడపలోని ఎసిఎ స్టేడియం, కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ఎసిఎ సౌత్ జోన్ అండర్-19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. టోర్నమెంట్‌లో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జట్లు పాల్గొననున్నాయి. శనివారం నాటికి అన్ని జట్లు కడపకు చేరుకున్నాయి. వారికి భోజనం వసతులను జిల్లా క్రికెట్ అసోసియేషన్ సిద్ధం చేసింది. ఆటకు అనువుగా ఎసిఎ స్టేడియం, కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానాలను క్యూరీయేటర్లు బాలరాజు, హరి సిద్ధం చేశారు.



ఆర్‌డి రామగిడ్డయ్యను సన్మానిస్తున్న ఎన్‌జిజిఒ నాయకులు

ఆర్‌డిని సన్మానించిన ఎన్‌జిజిఒ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ జోన్-4లోని ఉద్యోగులకు జూమ్ కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకంగా బదిలీలు నిర్వహించిన వైద్య ఆరోగ్యశాఖ ఆర్‌డి డాక్టర్ రామగిడ్డయ్యను ఎపి ఎన్‌జిజిఒ అసోసియేషన్ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఎన్‌జిజిఒ నాయకులు ఆర్‌డిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ బదిలీలు విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొ న్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హులైన వారికి బదిలీలు చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు, కడప జిల్లా అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, బి.శ్రీని వాసులు, అనంతపురం, కడప జిల్లాల కార్యదర్శులు రవికుమార్, చంద్ర మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు తిమ్మారెడ్డి, నిత్య పూజయ్య, ఆర్.జయచంద్ర, వెంకటేశ్వర్‌రెడ్డి, బాలపులయ్య, పద్మనాభం పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు : డిసిసి

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలో మహిళలు పిల్లలపై అత్యాచారాలు దుర్మార్గంగా పెరిగిపోతున్నాయని డిసిసి అధ్యక్షులు విజయ్ జ్యోతి అన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలపై నేరాలను అరికట్టడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్ర మహిళా కమిషన్‌ను బలోపేతం చేయాలన్నారు. మహిళలకు ఆర్థికంగా సాధికారత కల్పించడం వల్ల వారి ఆత్మగౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై అత్యాచారాలు భయంకరంగా పెరిగాయన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మహిళా మంత్రి, హోం శాఖ మంత్రి, రాష్ట్ర మహిళా కమిషన్ మహిళలపై జరుగుతున్న నేరాలు, ఘోరాలు అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి

ప్రజాశక్తి-కాశినాయన

ప్రతి విద్యార్థి కష్టపడి మంచి మార్కులు సాధించాలని ఎస్‌టియు సీనియర్ నాయకులు బి.బాలరాజు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని వరికుంట్ల కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి మంచి మార్కులు సాధించిన హుస్సేన్‌బికి పాఠశాల ఎస్‌ఒ మెర్సీ రాణి ఆధ్వర్యంలో రూ.ఐదు వేలు నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్లో చదివే ప్రతి పేద విద్యార్థిని కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని సూచించారు. మీ జీవితంలో మీ కాళ్ళ మీద మీరు నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న ఎస్‌టియు నాయకులు

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉమ్మడి కడప జిల్లాలో మినిమమ్ టైం స్కేల్‌పై పనిచేస్తున్న డిఎస్‌సి 2008, 1998 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఈ నెల 22న ఉదయం 9 గంటలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డిఇఒ షంషుద్దీన్ ఒక ప్రకటన తెలిపారు. ఉపాధ్యాయుల జాబితా జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. జాబితాలో పేర్లు ఉన్న ఉపాధ్యాయులు తప్పకుండా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకూ...

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల కొరకు పరీక్ష రాసిన విద్యార్థులు ఓపెన్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని గురుకుల పాఠశాల జిల్లా సమన్వయ అధికారి ఉదయశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నచౌక్‌లోని గురుకుల పాఠశాలలో 26న 5వ తరగతి చేరే విద్యార్థులకు, 27న ఇంటర్మీడియట్‌లో చేరే విద్యార్థులకు ఉదయం తొమ్మిది గంటలకు కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. సీట్లు మార్చుకోవాలి అనుకునే వారు కూడా హాజరు కావచ్చని పేర్కొన్నారు.

వ్యవసాయ శాఖలో స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛ ఆంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలోని ఓ బ్లాకు పరిసర ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సస్యరక్షణ సహాయ వ్యవసాయ సంచాలకులు మాధవి, సాంకేతిక వ్యవసాయ అధికారులు లక్ష్మణ్, గోవర్ధన్, జోస్న, పర్యవేక్షకులు శ్రీదేవి, శ్రీహరి పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రత పట్టని కార్పొరేట్ విద్యా సంస్థలు : పిడిఎస్‌యు

ప్రజాశక్తి-కడప అర్బన్

బస్సుల ఫీజుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల భద్రత విషయంలో పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తు కండిషన్ లేని కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల బస్సులను రవాణా శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సీజ్ చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు. ఎం అంకన్న కోరారు. శనివారం నగర శివార్లలోని జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారి నిరంజన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కడప నగరం, బద్వేల్, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు నియోజకవర్గం ప్రాంతాల్లోని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు డొనేషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ, మరోవైపు బస్సుల ఫీజుల పేరుతో తక్కువ కిలోమీటర్ల గాను వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల బస్సులు కాలం చెల్లిన, సామర్థ్యం లేని బస్సులు అనేకంగా ఉన్నాయని తెలిపారు. ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించకుండా బస్సులు తిరుగుతున్నాయని చెప్పారు. పలు కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల అయితే తక్కువ జీతం ఇస్తూ డ్రైవర్లను నియమించుకుని లైసెన్సులు లేకుండా కొనసాగిస్తూ వారి శ్రమను వాడుకుంటున్నారని పేర్కొన్నారు. బస్సులో సహాయకుడిగా విధిగా నియమించాల్సి ఉండగా నియమించలేదని తెలిపారు. జిల్లాలో ప్రతి ఒక్క విద్యా సంస్థల బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రస్తుతం అవి కనబడలేదని పేర్కొన్నారు. మోటార్ వాహనాల చట్టానికి విరుద్ధంగా వాహన పర్మిట్, ఫిట్నెస్, కాలుష్య నియంత్రణ, బీమా, డ్రైవర్ లైసెన్స్ పత్రాలు బస్సులో నిత్యం ఉండాలని అవి ఉండడం లేదని చెప్పారు. కావున స్పందించి రవాణాశాఖ అధికారులు మోటార్ వాహనాలకు చట్టానికి విరుద్ధంగా తిరుగుతున్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా నాయకులు మహేష్, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి-బద్వేలు

ప్రజా సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక పట్టణ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద వర్గాల ప్రజల సామాజిక భద్రతకు ప్రభుత్వాలు ముప్పు తెస్తున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను కూడా ప్రభుత్వాలు మంట కలుపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద వర్గాల ప్రజల సామాజిక భద్రతకు ముప్పు తెస్తున్న పాలకులు ఎన్నికల్లో డబ్బు, కులం, మతం ఆధారంగా గెలుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాసేవ ప్రజాసంక్షేమం విస్మరించారని విమర్శించారు. ప్రజలందరికీ నిత్యావసర సరుకులు చౌకదుకాణాల ద్వారా అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. అవినీతిపై ప్రజాబాహుల్యాలతో ప్రజా పోరాటాలు నడపాల్సిన తక్షణ కర్తవ్యం నేడు సమాజంలో ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్‌బాషా, బద్వేల్ రూరల్ కమిటీ కార్యదర్శి డి.వెంకటేష్, బద్వేలు పట్టణ కమిటీ సభ్యులు బాబు, అట్లూరు మండల కన్వీనర్ ఇ.రమణ, రవిచంద్ర, తిరుపాలు పాల్గొన్నారు.

చాలీచాలని వేతనాలతో కార్మికుల అవస్థలు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్



గ్రామీణుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మనోహర్

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్

గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు చాలీలాలని వేతనాలతో అవస్థలు పడుతున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ అన్నారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మైలవరం మండలంలోని పలు గ్రామాలలో నివాసముంటున్న పేద ప్రజల కష్టాలను, వ్యవసాయ కార్మికుల బాధలను, శ్రామికుల కష్టాలను ఇంటింటి సర్వే ద్వారా వారి కష్టాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొమ్మర నంద్యాల గ్రామంలో గ్రామీణ శ్రామికుల సర్వే చేస్తూ వారి యొక్క కష్టాలను తెలుపుకున్నామని పేర్కొన్నారు. చాలామంది వ్యవసాయ కుటుంబం, గనుల పనులు, భవన నిర్మాణ కార్మికులుగా చేసుకుంటూ రోజువారీ కూలీలుగా మారుతూ వస్తున్నారని తెలిపారు. మూడు నెలలు ఉపాధి కార్మికులుగా, మరో మూడు నెలలు వ్యవసాయ కార్మికులుగా, మరో మూడు నెలలు శ్రామికుడిగా జీవనం సాగిస్తూ గడుపుతుని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కుటుంబంలో భార్య పిల్లలతో కలిపి ఐదారు మంది ఉన్నారని తెలిపారు. రోజువారి కూలీ వేతనం రూ.300 నుంచి రూ.400 వరకు వచ్చినా సరిపడక ఖర్చులు పెరిగి అప్పులు అవుతున్నాయని తెలిపారు. కూలీ పనులు వెళ్లాలంటే సొంత గ్రామాలలో కాకుండా ఇతర గ్రామాలకు వెళ్లి కూలీ పనులు చేసుకోవాల్సి వస్తుందన్నారు. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక వ్యక్తి ద్వారా ముగ్గురి పోషణకు భారమవుతుందని పేర్కొన్నారు. మరి కొంతమంది ఆటో డ్రైవర్ల గాను, మరి కొంతమంది భవన నిర్మాణ కార్మికులు గాను, కొంతమంది మగ్గం ద్వారా, వారి వారి కష్టాలను వెలబుచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఉపాధి పనులలో వంద రోజులు నుంచి తక్కువ వ్యవధిలో పనులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇటీవలే వ్యవసాయ పనులను ప్రారంభించారని చెప్పారు. యంత్రాంగ పనిముట్ల ద్వారా వ్యవసాయ పనులు కూడా ఆశించినంతగా లేవన్నారు. చిరు ఉద్యోగం గాని, చిరు వ్యాపారం పెట్టుకున్నామన్నా ఆర్థిక వనరులు బాగా దెబ్బతిని కుటుంబ పోషణకి భారంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు శ్రామికుల పట్ల గ్రామాలలో ఉన్న రాజకీయ, ప్రభుత్వ అధికారులు చొరవచూపి శ్రామికుడికి బాసటగా నిలవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి విజయ్, అధ్యక్షుడు ఏసుదాసు, ఉపాధ్యక్షుడు వినయ్ కుమార్, కమిటీ సభ్యుడు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'గ్రంథాలయం నాగరికతకు చిహ్నం'



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

గ్రంథాలయం నాగరికతకు చిహ్నమని యోగి వేమన విశ్వ విద్యాలయ ఆచార్యులు డాక్టర్ ఎస్.ఈశ్వర రెడ్డి అన్నారు. శనివారం సెంట్ జోసెఫ్ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రధాన అధ్యాపకులు సొదుం రజనీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వికాస్ ఫౌండేషన్ తరపున వీరపునాయునిపల్లె మండలం ఉరుటూరు గ్రామంలో నూతనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ పేరుతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో గ్రంథాలయం స్థాపించి, గ్రామీణ యువతను విజ్ఞాన వంతులను చేయడానికి కృషి చేయడం ఆహ్వానించ పరిణామంగా కొనియాడారు. ప్రపంచ పోకడ గురించి తెలుసుకోవాలంటే పత్రికలు చదవాలని, లోతైన అవగాహన కోసం పుస్తకాలు చదవాలన్నారు. ఇప్పుడు ప్రపంచాన్ని విజ్ఞానం శాసిస్తోందని, ఆ విజ్ఞానం చదువుతోనే సాధ్యమని వివరించారు. గ్రంథాలయ అభివృద్ధిలో ఊరి ప్రజలు కూడా భాగస్వామ్యం వహించాలని పిలుపునిచ్చారు. సొదుం జయరాం, సొదుం రామమోహన్ లాంటి ప్రసిద్ధ కథకులు పుట్టి పెరిగిన గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించే అవకాశం తనకు లభించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానన్నారు. ఆయన రాసిన గ్రంథాలను ఈ గ్రంథానికి బహుకరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సొదుం రజనీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సీమల్లో పుట్టి పెరిగి, చదువుకుని మంచి పదవుల్లో వున్న ప్రతి ఒక్కరూ తాము పుట్టి పెరిగిన గ్రామాభివ ృద్ధికి ఎంతో కొంత సహాయం చేయాలని కోరారు. అలాంటి ఆలోచనే ఇక్కడ గ్రంథాలయ ఏర్పాటుకు ఊతం ఇచ్చిందన్నారు. ఉరిటూరి గ్రామస్తులతో పాటు పాఠశాల విద్యార్థులు కూడా గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. డిజిటల్ పుస్తకాల కోసం కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యం కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఉరిటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన అధ్యాపకులు సుధారాణి మాట్లాడుతూ పుస్తకం హస్త భూషణమే గాక జీవితాన్ని మార్చే గొప్ప సాధనం అని, పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర గ్రంథాలను కూడా అధ్యయనం చేయడం వల్ల ఉన్నత స్థితికి చేరుకోగలరని తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్.రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకమే ఇంటికి నిజమైన ఆభరణమని, అది లేని ఇల్లు నిజమైన పేదరికంలో మగ్గుతున్నట్టుగా లెక్క అంటూ పుస్తక ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉరుటూరు గ్రామాభివృద్ధి సభ్యులు తిరుమల రెడ్డి, మురళీధర రెడ్డి, విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బదిలీలలో ఎంటిఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

- డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-కడప అర్బన్

22వ తేదీ నిర్వహించ తలపెట్టిన కౌన్సెలింగ్‌లో ఎంటిఎస్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యుటిఎఫ్ జిల్లా శాఖ డిఇఒకు విజ్ఞప్తి చేసింది. శనివారం కడపలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ షేక్.షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ఎంటిఎస్ ఉపాధ్యాయులకు నిర్వహించ తలపెట్టిన కౌన్సిలింగ్ ప్రదర్శించిన ఖాళీలు అసంబద్ధంగా, నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. నిబంధనల మేరకు ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో బదిలీ పొంది, రిలీవర్ లేక రిలీవ్ కాకుండా నిలిచిపోయిన వారి స్థానాలను మాత్రమే చూపించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా ఖాళీలను చూపెట్టాలని తెలిపారు. దీనివల్ల బదిలీ పొంది రిలీవర్ లేక నూతన పాఠశాలలో చేరలేక అదే స్థానంలో కొనసాగాల్సి వస్తున్నదన్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు సుదూర ప్రాంతానికి వెళ్లి పని చేయాల్సి వస్తున్నదన్నారు. ఈ విధానం ఎంటిఎస్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించడంతోపాటు, సాధారణ బదిలీలలో బదిలీలు పొందిన ఉపాధ్యాయులు సైతం రిలీవర్ లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి ఇప్పుడు ప్రదర్శించిన ఖాళీలను మార్పు చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాల నుంచి పూర్తిస్థాయిలో బదిలీ పొంది, రిలీవర్ లేక ఖాళీగా ఉన్న అన్ని స్థానాలను ఖాళీలుగా చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంటిఎస్ ఉపాధ్యాయులు రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.



డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విపరీతం

ప్రజా'దృష్టి'

కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ప్రజాసమస్యలపై ఎటువంటి చర్చకు అవకాశం లేకుండా పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, మేయర్ కె.సురేష్‌బాబు ఎత్తుకు పైఎత్తులతో మాక్ సర్వసభ్య సమావేశానికి పరిమితం కావడం ఆందోళనకరం. అధికార, పాలకవర్గాల ఎత్తుగడల మధ్య అధికార యంత్రాంగం నలిగిపోతోంది. వరుసగా మూడు సర్వసభ్య సమావేశాలు అధికార, పాలకవర్గాల ఎత్తుగడల మధ్య వృథా కావడం క్షంతవ్యం కాని నేరమని గ్రహించాలి. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధులు పరి ణతితో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఎమ్మెల్యే కార్పొరేషన్ సర్వసభ్యసమావేశానికి ముందుగానే రావడం, పాలకవర్గ నాయకులు మేయర్ ఇచ్చిన గౌరవాన్ని ఎమ్మెల్యే నిలబెట్టుకోలేదని, తన ఇంటి ముంగిటే చెత్తాచెదారాన్ని వేయించారని, తన పార్టీకే చెం దిన మహిళా ప్రజాప్రతినిధిని సైతం అవమానించారని, మున్సిపల్ చట్టాల ప్రకారం మేయర్‌తో సమానంగా కుర్చీ వేయడానికి అవ కాశం లేకపోవడం కార ణంగానే కుర్చీ వేయలేదని పేర్కొనడం గమనార్హం. ఎమ్మెల్యే సైతం గౌరవం లేని చోటికి వెళ్లడం ఎందుకు, మహిళా ప్రజాప్రతినిధిని అవమానించారని ప్రచారం చేసుకోవడం ఎంత వరకు సమంజసమో ఆలోచించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎమ్మెల్యే, మేయర్‌ను ప్రజలు ఎన్నికల్లో ఎందుకు ఎన్నుకున్నారో గ్రహించాలి. ప్రజల సమస్యలను పరిష్కరించాలని, మెరుగైన పాలన అందిస్తారనే ఎన్నో ఆశలతో ఎన్నుకున్నారు. కానీ ఎమ్మెల్యే, మేయర్ వంటి నాయకులు చేసేది ఏమిటో ఆలోచించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా ఇద్దరు నాయకులూ భేషజాలను విడిచి ప్రాప్తకాలజ్ఞతను ప్రదర్శించి, కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాలను సజావుగా సాగాల్సిన విజ్ఞతను ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఎల్‌ఎల్‌ఎం సెట్ ఫలితాల్లో ఒంటిమిట్ట మండలానికి చెందిన యనమల లోకేశ్వరికి స్టేట్ సెకెండ్ ర్యాంక్ లభించడం అభినందనీయం. తాజాగా కేంద్ర రోడ్డు, రవాణా శాఖ వార్షిక ప్రణాళికలో రూ.920 కోట్లతో రాయచోటిఘాట్ సొరంగ మార్గాన్ని చేపట్టనుండడం, రూ.1,100 కోట్లతో కడప-ముద్దనూరు నేషనల్ హైవే పనులు చేపడతామని పేర్కొనడం ఉపశమ నం లభించింది. రాయచోటి ఘాట్ సొరంగ మార్గం పనులు పూర్తి చేయడం ద్వారా రాయచోటి, మదనపల్లి, బెంగళూరు ప్రయాణ సమ యం తగ్గుదలతోపాటు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పడిపోయే అవకాశం కనిపిస్తోంది. తల్లికివందనం పథకం కింద రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేయడంతో అకడమిక్ ఇయర్‌లో ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలో చదివే విద్యార్థులకు పెద్ద ఉపశమనం లభించింది. అన్నదాతా సుఖీభవ పథకం రైతులు అందరికీ వర్తించని నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన థంబ్ సెంటర్లలో వేలాది మంది రైతుల ఆధార్ సంఖ్య నమోదు చేస్తే వర్తించని నేపథ్యం విస్మయాన్ని కలిగిస్తోంది. గత సర్కారులో లబ్ధిపొందిన రైతులు, ప్రస్తుతం అర్హులు గాకపోవడం ఏమిటనే చర్చ నడుస్తోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



సరుకులు పంపిణీ చేస్తున్న గుప్తా కుటుంబ సభ్యులు

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గుప్తా మెడికల్స్ యజమాని నరసింహులు గుప్తా వర్ధంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన సంతాపసభకు ముఖ్యఅతిథిగా ఔషధ నియంత్రణ అధికారి సంధ్యారెడ్డి, డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్, ఆర్యవైశ్య సంఘం సభ్యులతో కలిసి గుప్తా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం దినేష్ గుప్తా అందజేసిన నిత్యావసర సరుకులను 30 మంది విభిన్నప్రతిభావంతుల కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, గుప్తా మెడికల్స్ యజమాని దినేష్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, రొటేరియన్ బింగి రామ్మోహన్, జగదీష్ మెడికల్స్ రాజా, అవోపా అధ్యక్షులు మేడా సాయిబాబా, సత్యసాయి సేవాసమితి సుబ్రమణ్యం, జనార్ధన్, శివ, పగడాల సురేంద్రబాబు, బాబ్ జాన్, కడప జిల్లా డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహ మూర్తి, పులివెందుల, జమ్మలమడుగు అసోసియేషన్ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక మానవుడిలో అశాంతి : తులసిరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పురపాలక సంఘం పరిధిలో ఉన్న బ్రాహ్మణపల్లిలో దేవర కో హరిహర భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో భాగవత సప్తాహం కార్యక్రమం 6వరోజు శనివారం పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు ఆధునిక మానవుడు అన్నీ ఉండి కూడా అశాంతితో అలమటిస్తున్నాడన్నారు. ఈ పరిస్థితిలో భాగవత సప్తాహం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానవునికి ప్రశాంతతను కలిగిస్తా యన్నారు. కార్యక్రమంలో భాగవతులు వెన్నపూస నారాయణరెడ్డి, మూలి జయరామ్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, తేరా పులా రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, ఆంజనేయులు, అంకి రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైసిపి యువ నాయకులు

యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాపాడు

నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వైసిపి యువజన విభాగం పిలుపుమేరకు ఈనెల 23న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న యువతపోరు కార్యక్రమానికి మద్దతుగా మైదుకూరు పార్టీ కార్యాలయంలో పార్టీ యువజన విభాగం అధ్యక్షులు యేమిరెడ్డి చంద్రఓబుల్ రెడ్డి మైదుకూరు నియోజకవర్గ యువతతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో 1.15 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటికీ ఒక్క నియామక ప్రక్రియ పూర్తి చేయలేదన్నారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగకపోవడం, డీఎస్సీ లోపభూయిష్టంగా ఉండడం నిరుద్యోగులకు నిరాశ కలిగిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు రూ.3,000 నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పి అమలు చేయ లేదన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల అధికారి డాక్టర్ జయమ్మ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బీట్ ద హీట్ కార్యక్రమాన్ని కళాశాల విద్యార్థులు చిన్నరంగాపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమం అధికారి డాక్టర్ జయమ్మ మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కళాశాల తరపున నిర్వహిస్తున్నామని తెలిపారు. మనం ఎండలో తిరుగుతున్నప్పుడు ఎండ అధికంగా ఉన్నప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, దీనికి అడ్డుకట్ట వేసే దిశగా ప్రభుత్వం బీట్ ద హీట్ అనే అంశం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. తగినంత నీరు తాగడం, ఎండలో ఎక్కువ సమయం గడపకుండా ఉండడం, తేలికైన దుస్తులను ధరించడం, చల్లని ప్రదేశాలలో ఉండడం, మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకొని మొక్కలు నాటడం వంటివి చేయాలన్నారు. తద్వారా ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయని తెలిపారు. చిన్నరంగాపురం గ్రామస్తులకు కళాశాల జాతీయ సేవా పథకం అధికారులు, కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అవగాహన ర్యాలీతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఇంజినీర్ నజ్మా, అధ్యాపకులు డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకిర్ బాషా పాల్గొన్నారు.



స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సోలార్ సిస్టం ద్వారా అనేక లాభాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఇళ్లకు సోలార్ సిస్టం బిగించుకోవడం ద్వారా అనేక లాభాలు పొందవచ్చునని విద్యుత్ శాఖ డిఇ కెవివి రమణారెడ్డి తెలిపారు. సోలార్ విద్యుత్ గురించి ప్రజలకు అవగాహన సదస్సును శనివారం విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా ఇళ్లకు ప్రతి ఒక్కరూ సోలార్ సిస్టంను బిగించుకోవడం వల్ల ప్రభుత్వం నుంచి రాయితీ పొందవచ్చు అన్నారు. ఒక ఇంటికి ఒక కిలో వాటు సోలార్ బిగించుకుంటే రూ.70,000 వరకు ఖర్చు వస్తుందని, ఇందులో రాయితీ రూ.30,000 ప్రభుత్వం లబ్ధిదారుడికి ఇస్తుందని తెలిపారు. అలా రెండు కెవి సోలార్‌కు రూ.60,000 వస్తుందని పేర్కొన్నారు. 3కెవి సోలార్‌కు రూ.78 వేలు రాయితీ వస్తుందని వివరించారు. సోలార్ వలన ఉత్పత్తి అయిన విద్యుత్తు ఇంటి అవసరాలకు సరిపోగా మిగులు ఉత్పత్తి అయిన విద్యుత్తు గ్రిడ్ ద్వారా లైనుకు వెళుతుందన్నారు. ఇందుకు యూనిట్‌కు రూ.2.10పైసలు చొప్పున విద్యుత్ సంస్థ లబ్ధిదారుడికి చెల్లిస్తుందని వివరించారు. సోలార్ ద్వారా పొల్యూషన్ ఉండదన్నారు. బీసీలకు అదనంగా రూ.20 వేలు రాయితీ వస్తుందన్నారు. ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకానికి స్పందన బాగుందన్నారు. పూర్తిగా రుణం ద్వారా ఈ పథకం



అవగాహన కల్పిస్తున్న డిఇ రమణారెడ్డి

పొందవచ్చు అని తెలిపారు. రుణం పొందగోరు వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు ద్వారా పొందవచ్చునని తెలిపారు. తక్కువ వడ్డీతో బ్యాంకులు రుణం ఇస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎడి కిరణ్‌కుమార్, ఎఇలు ప్రియదర్శన్‌రెడ్డి, చాంద్‌బాషా, హరి ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎఎఇ సుధాకర్, ఎస్‌బిఐ అధికారులు, టాటా, సన్‌షైన్, సన సోలార్ కంపెనీల అధికారులు, విద్యుత్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

ప్రజాశక్తి-కడప అర్బన్

మన దైనందిన జీవితంలో యోగా ఒక భాగంగా మారితే.. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎసిఎ క్రికెట్ స్టేడియంలో యోగాంధ్ర మహోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా ఆసనాలు వేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం, క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతాయన్నారు. దైనందిన జీవితంలో పలురకాల ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలు, శారీరక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులు రెడ్డి, ఎసిఎ స్టేడియం చైర్మన్ శ్రావణ్ రాజ్‌రెడ్డి, జెసి అధితి సింగ్, కెఎంసి కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, జిల్లా పర్యాటక అధికారి సురేష్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ రాజలక్ష్మి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఎస్‌డిసి రంగస్వామి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిపిఒ రాజ్యలక్ష్మి, డిఎంహెచ్ఒ నాగరాజు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డిఎస్‌డిఒ జగన్నాథరెడ్డి, ఆయుష్ నోడల్ అధికారి మురళి, యోగా గురువు ప్రసాద్ పాల్గొన్నారు. **ప్రధాన తపాలా కార్యాలయంలో** యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో యోగా గురువు సిద్దయ్య, డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్, ఎఎస్‌పిలు విజయ భాస్కర్‌రెడ్డి, విజయ భాస్కర్, హెడ్ పోస్టు మాస్టర్లు జె.సుబ్బరాయుడు, పబ్లిక్ ఇన్‌స్పెక్టర్ రఘుపతి, పిఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మున్నా, మార్కెటింగ్ ఇన్‌ఛార్జి వీర శేఖర్‌రెడ్డి, సలోమి, పుష్పలతారెడ్డి, తపాలా సిబ్బంది పాల్గొన్నారు. **కందుల విద్యా సంస్థల్లో** యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ లక్షుమయ్య, డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు. **గురుకుల్ విద్యాపీఠ్ స్కూల్‌లో** యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎ.వెంకటేశ్వర్లు, ఎవిఆర్ స్కూల్స్ సిఇఒ ఎ.ఎల్.వివేకానంద, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. **కడప ఆఫీసర్స్‌క్లబ్ ఈత కొలనులో** సీనియర్ సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, రెక్సిన్ ప్రభు, రేడియో జనార్ధనరెడ్డి పలు ఆసనాలు వేశారు. **యోగి వేమన విశ్వవిద్యాలయంలో** యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, యోగా గురువు రామ మనోహర్, డాక్టర్ బసిరెడ్డి రాఘవేంద్ర పాల్గొన్నారు. **ఆర్‌టిసిలో** యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎం గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సిపిఎం గజలక్ష్మి, సిఒఎస్ హరి, కడప డిపో మేనేజర్ డిల్లేశ్వరరావు, పర్సనల్ ఆఫీసర్ ధనలక్ష్మి, ఎటిఎం కమర్షియల్ జనార్ధన, సూపర్వైజర్లు, ట్రాఫిక్ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు. **కడప:** ఆరోగ్యం కోసం యోగా ఎంతగానో దోహదపడుతుందని నాల్గవ అదనపు జిల్లా జడ్జి గరికపాటి దీన బాబు అన్నారు. జిల్లా కోర్టులో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎన్.శాంతి, కె.ప్రత్యూష కుమారి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రేష్మ, మిత్రా యోగ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ రంగనాథం రెడ్డి పాల్గొన్నారు. **కాశినాయన :** నరసాపురం జడ్‌పి హైస్కూల్లో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మైథిలి, తహశీల్దార్ వెంకటసుబ్బయ్య, ఎంఇఒ నిర్మల, మండల వైద్యాధికారి పుష్ప, ప్రజలు, ఉద్యోగులు పాల్గొన్నారు. **వల్లూరు:** స్థానిక మోడల్ స్కూల్‌లో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీవాణి, ఎంపిడిఒ రఘురాం, ఎంఇఒ లీలమ్మ, విజయరెడ్డి, ప్రిన్సిపల్ సురేష్ బాబు, డాక్టర్ పనింద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బద్వేలు :** ఎస్‌బివిఆర్ కళాశాల ప్రాంగణంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితీష్‌రెడ్డి, డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, డిఎస్‌పి సురేంద్ర బాబు, బద్వేల్, గోపవరం తహశీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి పాల్గొన్నారు. **ముద్దనూరు** : బాలుర పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమలో మండల ప్రత్యేకఅధికారి శిరీష, తహశీల్దార్ వరదకిషోర్ రెడ్డి, ఎంపిడిఒ పరిపూర్ణ, సర్పంచ్ బోనం సరళ, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విన్నీలత, డిప్యూటీ ఎంపిడిఒ వీర భద్రుడు, ఎంఇఒ నాగేశ్వర నాయక్, కార్యదర్శి లక్ష్మి నరసింహులు, ఎపిఎం అపర్ణదేవి, ఎపిఒ గంగయ్య పాల్గొన్నారు. **వేంపల్లె :** మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో యోగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాదరావు, యోగా నిపుణులు సుష్మా, ఎంపిడిఒ కుళాయమ్మ, ఎంఇఒ స్టాలిన్ పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** జెఎన్‌టియు కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్ అధ్యక్షతన యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సాంబయ్య, యోగ శిక్షకుడు రెడ్డి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.రాధాకృష్ణ పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల**: జడ్పీహెచ్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషఫణి, మున్సిపల్ చైర్మన్ మూలే హర్షవర్ధన్‌రెడ్డి, సిఐ నరేష్‌బాబు, తహశీల్దారు శోభన్‌బాబు, హెచ్ఎం రామాంజనేయులురెడ్డి పాల్గొన్నారు. **ఖాజీపేట :** బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రూప్ వన్ అధికారి బీరం శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేతా, ప్రిన్సిపల్ హేమచందర్ పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** జడ్పీ హైస్కూల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మురళీధర్, ఎంపిడిఒ కృష్ణమూర్తి, తహశీల్దార్ సాయినాథ్ రెడ్డి, డిటి శ్రీహరిబాబు, ఎపిఒ జయ భారతి, ఎంఇఒలు ఓబులేసు, శారదా, డిఆర్‌డిఎ ఎపిఎం మంజునాథ్, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వెంకటరాముడు, హెచ్ఎం సతీష్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్వేత పాల్గొన్నారు. **చాపాడు :** మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద యోగా దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఎంపిపి టి.లక్షుమయ్య, ఎంపిడిఒ వీరకిషోర్, తహశీల్దార్ రమాకుమారి, ఐసిడిఎస్ సిడిపిఒ ముంతాజ్ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కస్తూర్బా పాఠశాలలో టిడిపి మండల అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, ఎంఇఒ-2 వంశీకృష్ణ, పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. చిన్న గురువలూరు వివేకానంద పాఠశాల, చాపాడు గాయత్రి పాఠశాలలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. **మైదుకూరులో..** పట్టణంలో యోగా దినోత్సవాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. చైర్మన్ మాచనూరు చంద్ర, తహశీల్దార్ రాజసింహ నరేంద్ర, అధికారులు పాల్గొన్నారు. మండల పరిధిలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. **పులివెందుల టౌన్ :** మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ హాకీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, యోగా గురువులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. లయోలా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఫాదర్ జోజీరెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి మురళి నాయక్, పట్టణ, రూరల్ సిఐలు, పోలీసులు యోగా ఆసనాలు వేశారు. **వేముల :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా దినోత్సవాన్ని డ్వాక్రా మహిళలు, విద్యార్థులు, ప్రజలతో ఎంపిడిఒ రాధాకృష్ణవేణి నిర్వహించారు. యోగా ట్రైనర్ వెలుగు ఎపిఎం ఆంజనేయులు ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారధిరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ ఇందిరా రాణి, పిఆర్ ఎఇ అబ్దుల్లా, ఇసి మధుసూదన్ రెడ్డి, ఎంఇఒ చంద్రశేఖర్, విఆర్ఒ మనోహర్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో యోగా దినోత్సవం నిర్వహించారు. సంస్కృతి సేవాసమితి కార్యదర్శి వంటేరు శ్రీనివాసులరెడ్డి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మునిశేఖర్ గురూజీ, బాబు గురూజీ, వెంకటరమణ గురూజీ, ప్రసాద్ గురూజీ, స్వప్న మాతాశ్రీని సన్మానించారు. కార్యక్రమంలో రాయలసీమ వ్యాయామ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పంచగల మధుసూదన బాబు, డాక్టర్ కూరపాటి శ్రీనివాసులరెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రయివేట్ ఉపాధ్యాయులు షేక్షావలి పాల్గొన్నారు.

శాటిలైట్ రంగం పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థి దశ నుంచే శాటిలైట్ రంగం పట్ల అవగాహన ఉండాలని మాజీ ఇస్రో ప్రాజెక్ట్ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ టికె సుందరమూర్తి తెలిపారు. మండల పరిధిలోని పల్లవోలు వద్దనున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఆయన స్పేస్ ల్యాబ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రథమ ప్రధాని నెహ్రూ మనదేశంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ఆయన ముందు చూపునకు నిదర్శనమన్నారు. అందుకే విక్రం సారాభాయ్ సారథ్యంలో 1969లో ఇస్రో ఆరంభించి నేడు నాసాతో పాటుగా శాటిలైట్‌ల ప్రయోగాలు చేయడం మన దేశ సాంకేతిక పరిజ్ఞానానాభివృద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ బి.రవీంద్ర , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న టికె సుందర మూర్తి

చిత్రలేఖనంలో రాణించిన విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు రాణించారు. శనివారం ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగాపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆయా తరగతుల విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో బొమ్మలు వేశారు. చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్ అభినందించారు. పోటీ పరీక్షల్లో ప్రతి విద్యార్థి పాల్గొన్నప్పుడే వారిలో ఉన్న ప్రతిభ అనేది గుర్తించేందుకు వీలుంటుందని శ్రీనివాసులురెడ్డి అన్నారు. నైపుణ్యతను ప్రతి విద్యార్థి ప్రదర్శించాలన్నారు. నైపుణ్యత ఉంటేనే ఆయా రంగాల్లో కూడా రాణించేందుకు వీలు ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ద్వారా విద్యార్థులను ప్రోత్సహించేందుకు వీలు ఉంటుందని చెప్పారు.

సమస్యలను పరిష్కరించాలి

చక్రాయపేట : సమస్యలను పరిష్కరించాలని టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి వెలుగు డిఆర్‌డిఎ పీడీ జి.రాజ్యలక్ష్మిని కోరారు. ఆ మేరకు ఆయన శనివారం ఆమెకు వివరించారు. వెలుగు పథకంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని, వెలుగు సిబ్బంది పనితీరు మారాలని కోరారు. కార్యక్రమంలో మావిరెడ్డి, ఎద్దుల చంద్ర, యువ నాయకులు లోమడ గణేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో జరిగే నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం అందినట్లు దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. దువ్వూరు మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన కుప్పనగారి సంజీవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రామాంజనేయుల రెడ్డి ఈ విరాళం అందజేసినట్లు తెలిపారు. వీరికి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వర్తి కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు వర్తి రాజస్వామి, మాజీ చైర్మెన్ కల్లూరి వెంకటస్వామి, సూపరింటెండెంట్ కె.సుభాష్ పాల్గొన్నారు.



దాతలకు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎసి



మాట్లాడుతున్న ఇర్ఫాన్

టిడిపి, వైసిపి దొందూదొందే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరును అభివృద్ధి చేసే విషయంలో టిడిపి, వైసిపి దొందూ దొందే అని కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఇర్ఫాన్ విమర్శించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి పరస్పర విమర్శలతో కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి గురించి మాట్లాడడం లేదన్నారు. వీరు స్వయం ప్రకటిత నిజాయితీపరులు, ధర్మరాజులు అని అభివర్ణించారు. వీరిరువురి ఒప్పందాలు హైదరాబాదులో జరుగుతాయన్నారు. ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి 15 సంవత్సరాలు ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండిన విషయం ఆయన గుర్తు చేశారు. రూ.150 కోట్లతో మొదలుపెట్టిన మంచినీటి పైప్‌లైన్ కార్యక్రమం ఆగిపోయిందన్నారు. రూ.22 కోట్లు విడుదలైన కూరగాయల మార్కెట్ నిర్మాణం ఆగిపోయిందన్నారు. పారిశుధ్య సమస్య అధికంగా ఉందన్నారు కాలువలో కూడిక తీయక దోమల బెడద అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాగింగ్ చేయడం లేదన్నారు. తడిపొడి చెత్తల ఇంటింటి సేకరణ సరిగా లేదన్నారు. సమస్యలపై మాట్లాడకుండా ఇరువురు నాయకులకు వ్యక్తిగత విమర్శలే ప్రధానంగా అయ్యాయని ఇర్ఫాన్ తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ప్రత్యేక నిధులు సాధించి పట్టణ అభివృద్ధికి పాటుపడాలని ఇర్ఫాన్ సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్లయ్య, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి మహమ్మద్ అబ్బాస్ పాల్గొన్నారు.

రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట ఎరువు సాగు కోసం 50 శాతం రాయితీతో 150 క్వింటాళ్ల జీలుగలు మంజూరయ్యాయని మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలత తెలిపారు. శనివారం అన్నవరం రైతు సేవా కేంద్రంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డితో కలిసి జీలుగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 8 వందల క్వింటాళ్ల వరకు పచ్చిరొట్ట ఎరువుల అవసరం ఉందన్నారు. మొదటి విడతగా 150 క్వింటాళ్లు జీలగలు మంజూరయ్యాయన్నారు. వచ్చే వారంలో మరిన్ని విత్తనాలు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. మొదటగా మడూరు, అన్నవరం సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో జీలుగలు పంపిణీ చేపడుతున్నామన్నారు. సోమవారం నుండి కావలసిన రైతులు రైతు సేవా కేంద్రంలో ఆన్‌లైన్ చేయించుకుని విత్తనాలు పొందాలన్నారు. జీలుగలను 50 శాతం రాయితీ పోనూ కిలో రూ.61.50తో రైతులు పొందవచ్చని సూచించారు. త్వరలో జింకు, జిప్సం కూడా పంపిణీ చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పులివెందులకు ఎంపిడిఒ బదిలీ

ప్రజాశక్తి సింహాద్రిపురం

సింహాద్రిపురం ఎంపిడిఒ కృష్ణమూర్తి పులివెందులకు బదిలీ అయ్యారు. ఆ మేరకు శనివారం ఉత్తర్వులు అందాయి. నాలుగేళ్లుగా సింహాద్రిపురం ఎంపిడిఒగా కృష్ణమూర్తి తనదైన శైలిలో మండలంలో అభివృద్ధి చేశారన్నారు. ప్రజల మన్ననలు పొందారు. ఇక్కడికి పులివెందులలో పని చేస్తున్న శ్రీనివాస్ రెడ్డిని బదిలీ చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

- కుమారుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడిపత్రి జాతీయ రహదారి ఎయిర్ పోర్ట్ వద్ద ద్విచక్ర వాహనం లారీ ఢీకొన్న సంఘటనలో భాస్కర్‌రెడ్డి (38) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం పోలీసులు అందించిన వివరాల మేరకు.. వల్లూరు మండలం పుల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో చెవి పోటుతో కడపలో ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్యను చూసేందుకు కుమారుడుతో కలిసి వెళుతుండగా.. ఎయిర్ పోర్ట్ వద్ద ఎర్రగుంట్ల నుండి కడప వైపు వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు ఢీకొంది. గాయపడిన వ్యక్తిని కడప రిమ్స్‌కు తరలించారు. భాస్కర్‌రెడ్డికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మల్లమ్మ..

ఖాజీపేట : మండల పరిధిలో నాగపట్నం గ్రామానికి వెళ్లే జాతీయ రహదారి కడప-కర్నూల్ హైవేపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కూనవారిపల్లెకు చెందిన మల్లమ్మ (55) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిందని పోలీసులు తెలిపారు. ఆమె రోడ్డు దాటుతుండగా మైదుకూరు నుంచి కడపకు వెళ్లే ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం కర్నూలుకు తరలించగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.



టిప్పర్ టైర్ల మధ్యలో ఇరుక్కున్న బైకు, తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్ రెడ్డి

అదుపు తప్పి టిప్పర్‌ను ఢీకొన్న బైకు

- పోస్ట్‌మెన్‌కు తీవ్ర గాయాలు, టిప్పర్ టైర్ల మధ్యలో ఇరుక్కున్న బైకు

ప్రజాశక్తి - ముద్దనూరు

తాడిపత్రి-కడప ప్రధాన రహదారి సమీపంలో ఉన్న కొత్త ఆర్‌టిసి బస్టాండ్ వైపు నుండి రోడ్డు పైకి వస్తున్న టిప్పర్ లారీని బైకు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాద ఘటనలో బైకుపై వస్తున్న గంగిరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి తీవ్రగా గాయపడ్డారు. కాలు, చెయ్యి విరిగాయి. బైకు ముందు టైర్ భాగం టిప్పర్ వెనుక టైర్ల మధ్యలో ఇరుక్కుపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట్ల మండలం సిరాజుపల్లెకు చెందిన గంగిరెడ్డి పవన్‌కుమార్ రెడ్డి పోస్టుమెన్‌గా పనిచేస్తున్నారు. ఆయన ప్రస్తుతం ముద్దనూరులో నివాసం ఉంటున్నారు. శనివారం పవన్‌కుమార్ రెడ్డి బైకులో ముద్దనూరు నుంచి తన స్వగ్రామమైన సిరాజుపల్లెకు వెళుతుండగా బైకు వేగాన్ని అదుపు చేయలేక రోడ్డు పైకి వస్తున్న టిప్పర్ లారీని ఢీ కొట్టాడు. గాయపడిన పవన్‌కుమార్‌రెడ్డిని ప్రయివేట్ వాహనంలో వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

ఐదుగురు మట్కా బీటర్లు అరెస్టు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని నాగూరు గ్రామంలో మట్కా ఆడుతున్న ఐదుగురు మట్కా బీటర్లును అరెస్టు చేసినట్లు సిఐ నర్సింహులు తెలిపారు. వారి వద్ద నుండి రూ.8వేలు నగదు, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సమాచారం మేరకు దాడులు చేశామన్నారు.